క్లుప్తంగా

కురుస్తున్న తరగతి గదులు!



పెచ్చులూడిన సంగాయిగుట్టతండా పాఠశాల భవనం పైకప్పు

యాలాల: మండలంలోని సంగాయిగుట్టతండా ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి తరగతి గోడలు తడిశాయి. ఫ్లోరింగ్ సైతం తడిగా ఉంటుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవన నిర్మాణానికి కృషిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంధుడి కుటుంబానికి సరుకుల అందజేత



బాధిత కుటుంబానికి సరుకులను అందిస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని గోవిందరావుపేటకు చెందిన అంధుడు నజీర్ కుటుంబానికి కాంగ్రెస్ స్థానిక నేత పేరి రాజేందర్‌రెడ్డి అండగా నిలిచారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నజీర్ ఇల్లు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన స్థానిక ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు నాగయ్య, మోయిజ్, అహ్మద్, చందు, మారుతీ తదితరులతో వెళ్లి నజీర్ కుటుంబాన్ని పరామర్శించారు. నిత్యావసర సరుకులను అందజేసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్, లాలు, నర్సింహులు, ఉమేశ్, జలీల్, రజాక్, మౌలాన ఉన్నారు.

'రైతునేస్తం' సాగుకు ఉపయుక్తం



రైతునేస్తంలో భాగంగా పాల్గొన్న రైతులు, వ్యవసాయ అధికారులు

దౌల్తాబాద్: రైతు నేస్తం కార్యక్రమం సాగుకు ఎంతో లాభమని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య అన్నారు. మంగళవారం మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక విధానాలపై సలహాలు, సూచనలు అందించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో పంటలు అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.

అవార్డులు రావడం సంతోషకరం



ఎంపీడీఓ విజయలక్ష్మిని సన్మానిస్తున్న కార్యదర్శులు

మోమిన్‌పేట: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలానికి ఉత్తమ అవార్డులు రావడం ఎంతో సంతోషకరమని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ మల్లయ్యలను కార్యదర్శులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవార్డులు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కింది స్థాయిలో పనిచేస్తున్న కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది వల్లనే ఉత్తమ అవార్డులు దక్కాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ మన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

మంచాల: మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆశ్వల బాలరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తమ సంఘ భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, రమేష్, జగన్, ఎం.వెంకటేష్, సురేష్, నర్సింహ, మహేష్, ముత్యాలు, యాదగిరి, రఘు, రాజు, రంజిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆపదొస్తే.. అరిగోసే!

ఆపదొస్తే దేవుడా నీవే దిక్కని దుద్యాల్ మండలవాసులు ఆర్తనాదాలతో విలపిస్తున్నారు. మండలం ఏర్పాటైనా ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు లేకపోవడంతో అత్యవసర సమయంలో అరిగోస పడుతున్నారు. కాస్త ఆర్థికంగా బాగున్న వారు ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదిస్తే, నిరుపేదల పరిస్థితి ఏంటని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు.

- దుద్యాల్‌లో కరువైన ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు
- ప్రైవేట్ వైద్యశాలలను సంప్రదిస్తున్న ప్రజలు
- ప్రమాదాల సమయంలో సొంత వాహనాలే దిక్కు



అద్దె గదిలో కొనసాగుతున్న పల్లె దవాఖాన

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో ప్రజారోగ్యానికి భరోసా లేకుండా పోయింది. మండలం ఏర్పాటై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే చికిత్స కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మండల కేంద్రానికి ఆనుకుని జాతీయ రాహదారి పనులు సైతం ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. అయినా మండల కేంద్రంలో అంబులెన్స్ కాని, ఆస్పత్రి సౌకర్యం కాని లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలో అత్యవసర సమయంలో చికిత్స అందించేందుకు ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు అందుబాటులో లేవు.

ప్రాణాలు పోతున్న ఘటనలు

మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఉప కేంద్రంతో సాధారణ వైద్య సేవలు కూడా అందలేకపోతున్నాయనే ఆరోపణలున్నాయి. గ్రామంలో ఏదైన సంఘటనలు, ప్రమాదాలు సంభవిస్తే చికిత్స కోసం క్షతగాత్రులను తరలించేందుకు ప్రైవేట్ వాహనాల్లో కోస్గి, కొడంగల్, తాండూరు, మహబూబ్‌నగర్ వంటి తదితర పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. అలా తరలించే క్రమంలో కొన్ని సందర్భాలలో ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలున్నాయి. మండల కేంద్రంలో వైద్యశాల ఉంటే చుట్టుపక్కల గ్రామాల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా త్వరగా వైద్యం అందే అవకాశం ఉంటుంది.

వైద్య సేవలు కరువు

మండల కేంద్రంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో సరైన మందులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న సంఘటనలు జరిగినప్పుడు వెళ్తే ప్రథమ చికిత్స మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇక్కడ కుట్లు వేసేంత చికిత్స లేకపోవడంతో ప్రైవేట్ చికిత్సాలయాలను సంప్రదించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 50వేల వరకు జనాభా ఉన్నా ఆస్పత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు.

అద్దె భవనంలో ఉప కేంద్రం

మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన పల్లె దవాఖానలో తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆరోగ్య ఉప కేంద్రం, పల్లె దవాఖానలు అద్దె ఇంట్లో సాగుతుంది. ప్రథమ చికిత్స సైతం చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వైద్య సిబ్బంది వాపోతున్నారు.

“ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మండలం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా నేటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు నోచుకోలేదు. అంబులెన్స్ లేకపోవడంతో ఏదైన ప్రమాదాలు, అత్యవసర సందర్భాల్లో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. మండల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆస్పత్రి, అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.

– నరేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

కుల్కచర్ల: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీపీఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని నగరంలోని ఇందిరా పార్క్ దగ్గర సెప్టెంబర్ 1న జరిగే మహాధర్నా వాల్‌పోస్టర్ పీఆర్‌టీయూ సంఘం నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రవేశపెట్టిన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇందిరా పార్క్ వద్ద శాంతియుత ధర్నా చేపట్టేందుకు పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి బస్వరాజ్, బాధ్యులు పెంటయ్య, తావుర్య, శ్రీశైలం, అపర్ణ, శేఖర్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సంతోష్, మల్లేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



దౌల్తాబాద్‌లో లూయిస్ డాగురెకు నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

దౌల్తాబాద్: మండలంలో మంగళవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మండల కేంద్రంలో కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురెకు నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్, సభ్యులు రవి, అశోక్, నర్సిములు, రాజు, వెంకటేష్, రామచందర్, చాంద్‌పాషా ఉన్నారు.

పండ్ల పంపిణీ

బొంరాస్‌పేట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం, జాతీయ మానవత్వం దినం సందర్భంగా మండల ఫొటో గ్రాఫర్లు మానవత్వం చాటుకున్నారు. ఫొటోగ్రాఫర్ల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు రవికుమార్, ప్రతాప్‌కుమార్, సాదిక్, పాషా, మల్లేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థికి సన్మానం



మధుకుమార్‌ను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయుల బృందం

దోమ: ఎన్ఐటీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)కి ఆలిండియా కోటాలో నిరుపేద విద్యార్థి సత్తాచాటాడు. దోమ మండల పరిధిలోని పాలేపల్లికి చెందిన ఉప్పరి మధుకుమార్ 2022లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ చదివాడు. నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి నీట్ పరీక్ష రాశాడు. ఆలిండియా కోటాలో శ్రీనగర్ ఎన్ఐటీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు మంగళవారం మధుకుమార్‌ను శాలువాతో సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివి నీట్‌కు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

వర్షాల వేళ.. పాత ఇళ్లతో భద్రం

దుద్యాల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శిథిల ఇళ్లతో ప్రమాదం పొంచి ఉంది. ముసురు వర్షాలకు పాత గోడలు తడిసి కూలిపోయే అవకాశం ఉండడంతో అలాంటి ఇండ్లలో నివాసం ఉండొద్దని అధికారులు సూచిస్తున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని తూర్పు సత్యమ్మ, గోవిందు అనే దంపతులు పూర్తిగా శిథిలమైన ఇంట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతో జీవనం సాగిస్తున్నారు. ఇలా ప్రమాదకరంగా ఉన్న ఇంట్లో ఉండొద్దని అధికారులు తెలుపుతున్నారు.



పోలేపల్లిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు

పట్టపగలే.. హైమాస్ట్ వెలుగులు



బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. నిర్వహణ లోపంతో పాటు పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యానికి నిదర్శంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధిలైట్లు, హైమాస్టు లైట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరుతున్నారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య స్థానిక పంచాయతీ సిబ్బందితో నిర్వహణ చేయిస్తానని చెప్పారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన ఎక్మాయివాసులు

బషీరాబాద్: మండల పరిధిలోని ఎక్మాయికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్ వెళ్లిన వీరు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. వీరిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్యామప్ప, హన్మంతు, విఠల్ రెడ్డి, బోనప్ప, కమల్, కాశీనాథ్ సాయిలు తదితరులు ఉన్నారు.

ప్రైవేటు వాహనాలపై చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతినా రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ బస్సుల ద్వారా పిల్లలను బడికి తీసుకొస్తున్నారని, వాటికి సరైన పర్మిట్‌లు, ట్యాక్స్ చెల్లింపులు, ఫిట్‌నెస్ సైతం లేవని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే యాజమాన్యాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మార్కెట్‌యార్డు పనులు పూర్తిచేయాలి

కొత్తూరు: పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ మంగళవారం ప్రకటనలో అధికారులను కోరారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని ఆరోపించారు. దీంతో కూరగాయలు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతీ ఆదివారం సంతలోకి వాహనాలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. మార్కెట్ పూర్తయితే వ్యాపారులు అక్కడ అన్ని సదుపాయాలతో వ్యాపారం నిర్వహించుకునే వీలుంటుందన్నారు.

నేరాల నియంత్రణకు కఠిన చట్టాలు



అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ తదితరులు

పరిగి: మహిళలపై జరుగుతున్న అసభ్య ప్రవర్తనపై వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్ఐ మోహన్‌కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో దడఫడేల్స్ స్కూల్‌లో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు కఠినమైన నిర్భయ చట్టం, పోక్సో చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు.ఎలాంటి ఘటన జరిగిన వెంటనే 100కు లేదా 181కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో నేటికి బాల్య వివాహాలు జరుగుతున్నాయని వాటి నివారణకు ముందుండి పోరాటం చేయాలన్నారు. బ్యాంకింగ్ మోసాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో షీటీం ఇన్‌చార్జ్ నర్సింహులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

బంట్వారం: ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం యూనియన్(సీఐటీయూ) కోట్‌పల్లి మండల అధ్యక్షురాలు అమృత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై మాసం పెండింగ్ వేతనం చెల్లింపులతో తదితర డిమాండ్లపై ఆశావర్కరు మంగళవారం కోట్‌పల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడారు. గతంలో మాదిరిగా సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. రూ.18 వేలకు జీతం పెంచుతూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైన ఆశావర్కర్లకు డైరెక్ట్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. గత డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏఎన్‌సీ, పీఎన్‌సీ టార్గెట్లను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ ఆఫీసర్ మేఘనకు అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు అండాలు, శోభారాణి, విజయ, సుమిత్ర, సుశీల, వినోద తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని కబ్జా చేస్తే సహించేది లేదు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జా చేస్తే సహించేది లేదని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్ అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో హాస్టల్‌కు ప్రహరీ నిర్మించి కొంత స్థలాన్ని కబ్జా చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అలా చేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. మంగళవారం హాస్టల్‌కు నిర్మిస్తున్న ప్రహరీని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. గతంలో ఉన్న స్థలంలోనే ప్రహరీ నిర్మించాలని అలా కాకుండా కొంతమేర కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దారు గాయత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భీములు, ఆశప్ప, బాల్‌రాజు, పకీరప్ప, సంతోష్, భీంరెడ్డి, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్

కొడంగల్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న 50 మందికి పరీక్షలు చేయగా అందులో 14 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కార్యదర్శి భీంరాజు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలన్నారు. ఆపన్నులకు సాయం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాకేత్, లయన్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి కానుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం



మెడికల్ కిట్‌లను పరిశీలిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్

కుల్కచర్ల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించి మెడికల్ కిట్‌లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వానలు దంచి కొడుతుండడంతో దోమ వ్యాప్తి చెంది విద్యార్థులకు డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించి మాత్రలను అందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూపరాదన్నారు. కార్యక్రమంలో కేజీబీవీఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- యాలాల పీహెచ్‌సీ ఎదుట ధర్నా



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

యాలాల: పెండింగ్‌లో ఉన్న ఆశవర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు బుగ్గప్ప, మల్కయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించి వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల హామీల్లో భాగంగా ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రెండేళ్లవుతున్నా ఈ విషయంలో చొరవ చూపడం లేదని మండిపడ్డారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించి, ఆరు నెలల ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆశవర్కర్లు శశికళ, అలవేలు, లలిత, శివలీల, కవిత, అనిత, సుమలత, సువర్ణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు ఏమి జరుగుతున్నాయి.. ఎలా నిర్వహిస్తున్నారు అని సంబంధిత అధికారి రమ్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో మొక్కలు ప్రజలకు పంపిణీ చేశారా అని ఎంపీడీఓ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.